# ప్రేమికులు

## -సింగా



క్రొత్తగా వచ్చిన ఎదురింటి అమ్మాయి మీద రాము కళ్ళు పడ్డాయి. నానా అవస్థలు పడి ఎట్లయితేం ఆ అమ్మాయి వివరాలు కనుక్కున్నాడు రాము. ఆమె పేరు లత. ఆమె తల్లితండ్రులు ఈ మధ్యనే పోయారట. వాళ్ళ బంధువులెవరో ఆమెకు తెలియదు. దానికి కారణం వాళ్ళ అమ్మ, నాన్న ప్రేమించి పెళ్ళి చేసుకుని ఈ ఊరు వచ్చి ఇక్కడే పోయారు. దానితో ఆమె ఒంటరి అయింది.

ఇప్పుడు ఆమెకి మిషన్ పని నేర్పిన టీచర్ తోడుగా వుంటుంది. ప్రస్తుతం ఆ అమ్మాయి గురించి రాము తెలుసుకున్న వివరాలు ఇవి. రాము రోజూ ఎదురింటి అమ్మాయి లత గురించే పదేపదే ఆలోచిస్తున్నాడు. రాము లతను చూసిన తొలిచూపులోనే ఆమె రూపం అతని హృదయంలో నిలిచిపోయింది. నిజంగా లతను చూసిన వాళ్ళెవరూ మరచిపోరు. గుండ్రటి కళ్ళు, చక్కని ముక్కు, ఎర్రని అధరాలు, ఏ మాటకు ఆ మాట అనుకోవాలి. ఆమెది చాలా అందమైన రూపం. దానికి తగ్గట్టుగా ఎప్పుడూ మౌనంగా వుంటుంది. ఆ మౌనంలో ఆమెని చూస్తే రాముకు మరింత అందంగా కనబడుతుంది. అలా కొన్ని నెలలు గడిచాయి. ఇద్దరి మధ్య ప్రేమాయణం ప్రేమలేఖల ద్వారా సాగుతుంది. ఆ లేఖల ద్వారానే పెళ్ళి కూడా చేసుకుందాం అని అనుకున్నారు. కాని ఇద్దరి మధ్య ఒక కోరిక. రాము కోరిక ఏమిటంటే— "లతా! నువ్వెప్పుడు మౌనంగా వుంటావు. నీ నుదను విప్పి నాతో మాట్లాడరాదా!" అని రాము అంటే లతేమో "రామూ! నువ్వెప్పుడు కళ్ళజోడు పెట్టుకునే ఉంటావు. ఒక్కసారైనా కళ్ళజోడు తీసి దర్శనమియ్యనా" అని లత. అయితే రాము అడిగిన ప్రశ్నకి సమాధానంగా 'పెళ్ళి కాకుండా ఓ అబ్బాయి, ఓ అమ్మాయి కలిసి మాట్లాడుకోవడం ఎవరైనా చూస్తే అనేక రకాలుగా అనుకుంటారని" లత. రాము ఏమో "నాకెప్పుడు కళ్ళజోడు పెట్టుకునే అలవాటు, అయినా తొందరెందుకు నీ కళ్ళల్లో నా కళ్ళు పెట్టుకు చూసే రోజులు మరెన్నో లేవు కదా!" అని ఇలా ఒకరి ప్రశ్నకి ఒకరు సమాధానం ప్రేమలేఖల ద్వారా చెప్పుకుంటున్నారు.

మరి కొన్నాళ్ళు గడిచిన తరువాత రామూ లతని రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నాడు. సమయం 8 కావస్తుంది. ఆకాశంలో చంద్రుడు ఎక్కడికో వేగంగా పోతున్నాడు. ఆ రోజే శోభనం. రామూ తెగ ఆనందపడి పోతున్నాడు. మల్లెపూలతో చక్కగా అలంకరించిన బెడ్ మీద నువాసన పీల్చుకుంటూ ఉండగా చిన్నగా తలుపు తీసుకుని సగ్గుపడుతూ పాల గ్లాసుతో లత వచ్చింది. రామూ ఆమె చిటికిన వ్రేలు పట్టుకుని ఆమె చేతిలోని పాలగ్లాసు అందుకుని, ఒక్కసారైనా ఆమె స్వరం వినాలనే "నీ పేరు చెప్పవా!" అన్నాడు చిలిపిగా రాము. ఆ మాట వినగానే లత ఆమెతో పాటు తెచ్చిన తెల్ల కాగితం మీద 'లత' అని వ్రాసింది. రాయడం కాదూ నోటితో చెప్పు" అన్నాడు దానితో "మ..మ...మ..." అని నోరు తెరిచి లత అనడంతో, "ఏమిటే! నీకు మాటలు రావా!" అని రాము కోపంగా కళ్ళజోడు తీశాడు. ఒక కన్ను లేని రాము మోహంలోకి భయంగా చూస్తూ వుండి పోయింది లత. ●

# వార్తలు



ఆకాశవాణి వార్తలు చదువుతున్నది బద్ధకాల సోమరినాథ్. నిన్న సాయంత్రం హైద్రాబాద్‌లోని 'నాంపల్లి స్టేషన్ రోడ్‌లోని ఒక సందులో ఇద్దరు పోలీసులు ఒక యువతిని మానభంగం చెయ్యటానికి ప్రయత్నిస్తుండగా అదే దారిన పోతున్న ఇద్దరు రౌడీలు ఆ అమ్మాయిని రక్షించారు. పోలీసులు పరారయ్యారు. రాష్ట్రమంత్రి శ్రీ ముక్కుదాసు గారు తన ముక్కు పొడుం డబ్బా కనిపించలేదని ఫిర్యాదు చేయగా, దీని గురించి పోలీసు శాఖ వారు తీవ్రంగా గాలిస్తున్నారు. నిన్న కాకినాడలో అధికారులు ఒక కూరగాయల మార్కెట్టుపై దాడి జరిపి కిలో పుచ్చొంకాయలు, ఒక వడలిపోయిన తోటకూర కట్ట స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఢిల్లీలో ఒక ఫామిలీ ప్లానింగ్ ఆఫీసర్ గారి భార్యకు ఒకే కాన్పులో ఆరుగురు పిల్లలు పుట్టారట. ఇది ఆమెకు పదమూడవ కాన్పు అని వివరాలందాయి. నిన్న జరిగిన అంతర్జాతీయ మహిళ మండలి సమావేశంలో శ్రీమతి అండాళ్ళమ్మ గారు మాట్లాడుతూ దేశంలో అప్పడాల కర్రల వుత్పత్తి త్వరితంగా సాగాలనీ, అందుకు అందరూ చేతనైనన్ని చెక్కముక్కలు విరాళంగా ఇవ్వాలనీ సూచించారు. ఈరోజు వుదయం కేంద్ర మంత్రిగారయిన కీర్తిశేషులు పాతళ భేతాళం రావ్ గారు పార్లమెంట్‌లో మాట్లాడుతూ దేశంలో యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయనీ, అందుకు మనమంతా ఎంతో గర్వించాలనీ, ఇవి దినదినాభివృద్ధి చెందాలనీ ఆసక్తిని వెల్లడి చేసారు. ఒక పెద్ద హోటల్ కాలిపోగా ఒక స్పూన్, రెండు ఇడ్లీల నష్టం సంభవించింది. మరియు రెండు గాజు గ్లాసులు బీట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. పత్రికల వాళ్ళు ఫోటోలు తీసుకున్న తరువాత ఫైర్ సర్వీసు వారు దాన్ని ఆర్పివేశారు. రేపు వుదయం కొల్లేరులో ఒక ఓడ మునిగిపోగా, 2 చేపలు మరణించాయి, 3 కప్పలు గాయాలు తగిలాయి, వార్తలు ముగించే ముందు ఈ పూట విశేషాలు మరొక్కసారి చెప్పేటం ఓపిక నాకు లేదు కనుక ఇంతటితో ముగిస్తున్నాను.

— పి. సునీల్, పెద్దకొట్టాల.